కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

హాజీపూర్, ఏప్రిల్ 1 : మండలంలోని దొనబండ గ్రామంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్ సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏ-గ్రేడ్ రకానికి రూ. 2203, బీ-గ్రేడ్ రకానికి రూ. 2183 ధర నిర్ణయించిందన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీవోలు, కమిటీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

హాజీపూర్ : కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ మోతీలాల్

అధికారులతో సమావేశం..

మంచిర్యాల అర్బన్, ఏప్రిల్ 1 : కలెక్టరేట్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి వాజిద్, పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ గోపాల్, జిల్లా వ్యవసాయాధికారి కల్పన, జిల్లా మార్కెటింగ్ అధికారి గజానంద్‌తో కలిసి కొనుగోలు కేంద్రాల ఏపీఎంలు, సీసీలతో అదనపు కలెక్టర్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని రైతుల నుంచి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్ అన్నారు. ఏ గ్రేడ్ క్వింటాలకు రూ.2,203, కామన్ గ్రేడ్‌కు రూ.2,183 మద్దతు ధర నిర్ణయించామని తెలిపారు.

జన్నారంలో..

జన్నారం, ఏప్రిల్ 1 : జన్నారం మండలం మొర్రిగూడ గ్రామంలో తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి ప్రారంభించారు. రైతులు ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి, మద్దతు ధర పొందాలని సూచించారు. దళారులను నమ్మి మోసపోవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శశికళ, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

తాండూర్‌లో..

తాండూర్, ఏప్రిల్ 1 : తాండూర్ మండలం అచ్చలాపూర్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏఈవో ధనలక్ష్మి, పీఏసీఎస్ సీఈవో శ్రీనివాస్‌తో కలిసి గిర్దావార్ మురళీధర్‌రావు ప్రారంభించారు. రైతులు ఇబ్బందులు పడకుండా విధులు నిర్వర్తించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది అనిల్, వెంకటేశ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కోటపల్లిలో..

కోటపల్లి, ఏప్రిల్ 1 : కోటపల్లి మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ మహేంద్రనాథ్, ఎంపీడీవో ఆకుల భూమయ్య ప్రారంభించారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సెక్రటరీ రాజు నాయక్, అసిస్టెంట్ సెక్రటరీ పెర్క లక్ష్మణ్, రైతులు పాల్గొన్నారు.

చిత్తాపూర్‌లో..

నెన్నెల, ఏప్రిల్ 1 : యాసంగి పంట కోసం ప్రభుత్వం ఐకేపీ ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నదని నెన్నెల ఏపీఎం విజయలక్ష్మి తెలిపారు. చిత్తాపూర్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. గ్రామ సంఘం సభ్యులు, సీసీలు పాల్గొన్నారు.

ఉత్పత్తి 'లక్ష్యం' పూర్తి

- 70.028 మిలియన్ టన్నుల బొగ్గు వెలికితీత
- 69.86 మిలియన్ టన్నులు రవాణా..
- రూ.37 వేల కోట్ల టర్నోవర్.., రూ.27 వేల కోట్ల లాభాలకు అవకాశం..
- ఏడు ఏరియాల్లో 100 శాతం టార్గెట్

సింగరేణి హెడ్డాఫీస్

శ్రీరాంపూర్, ఏప్రిల్ 1 : సింగరేణి.. తమ ఉత్పత్తి లక్ష్యాన్ని 100 శాతం సాధించింది. పదేండ్లుగా ఏటేటా ఉత్పత్తి లక్ష్యాలు సాధిస్తూ రికార్డులు నెలకొల్పుతున్నది. గతేడాది 69.80 మిలియన్ టన్నులు.. 2023-24 ఆర్థిక సంవత్సరం 70.028 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించింది. అమ్మకాలు, రవాణాలో కూడా అదే స్థాయిలో నిలిచింది. మొత్తంగా 69.86 మిలియన్ టన్నుల బొగ్గు రవాణా చేసింది. ఓసీపీలో మట్టి తవ్వకాలు, రవాణా 420.32 మిలియన్ క్యూబిక్ మీటర్ల తీసింది. దీంతో ఈ ఏడాది 37 వేల కోట్ల టర్నోవర్‌తో సుమారు రూ.27 వేల కోట్ల లాభాలు నమోదు చేసుకునే అవకాశం ఉందని తెలుస్తున్నది.

7 ఏరియాల్లో 100 శాతం..

సింగరేణి వ్యాప్తంగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో 7 ఏరియాలు 100 శాతం ఉత్పత్తిని అధిగమించాయి. సింగరేణిలో ఇల్లెందు ఏరియా 109 శాతం ఉత్పత్తితో మొదటి స్థానంలో నిలిచింది. కొత్తగూడెం, ఆర్జీ-3 ఏరియాలు 107 శాతం ఉత్పత్తితో రెండో స్థానాల్లో నిలిచాయి. మణుగూరు ఏరియాల్లో 106.., బెల్లంపల్లి.., ఆర్జీ-1 ఏరియాల్లో 103.., ఆర్జీ-2 ఏరియాలో 102 శాతం ఉత్పత్తి నమోదైంది. అలాగే మందమర్రి 91 శాతం.., శ్రీరాంపూర్ 89 శాతం.., ఆడ్రియాల 85 శాతం.., భూపాలపల్లి 73 శాతం తర్వాతి స్థానాల్లో నిలిచాయి.

దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాల అర్బన్, ఏప్రిల్ 1 : రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో దూరదర్శన్ కేంద్రం ప్రాంతీయ వార్తా విభాగం కింద స్ట్రింగర్ల ఎంపానల్‌మెంట్ కోసం అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆర్ఎన్‌యూ హెడ్, సంయుక్త సంచాలకులు (వార్తలు) రాహుల్ గొలీకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తును డిమాండ్ డ్రాఫ్ట్, అనుబంధ పత్రాలతో జతచేసి గడువులోగా అందించాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం www.prasarbharati.gov.in/pbvacancies)లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

నరేశ్ వర్మకు సన్మానం

మంచిర్యాల ఏసీసీ, ఏప్రిల్ 1 : జిల్లా కేంద్రంలోని ఎస్ఎస్ గ్రాఫిక్స్ స్టూడియోలో సోమవారం మంచిర్యాల మూవీ ఆర్టిస్ట్, 24 క్రాఫ్ట్స్ కళాకారుడు ముద్దం నరేశ్ వర్మను స్థానిక సినీ దర్శకుడు, రుద్రనేత్రి మూవీ ఫేమ్ కర్రె తిరుపతి వర్మ ఆధ్వర్యంలో సన్మానించారు. ఇక్కడి కళాకారులను గుర్తించి, బుల్లితెరకు, వెండి తెరకు పరిచయం చేస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుండ శశిధర్, కోటపల్లి పోలీస్ స్టేషన్ మూవీ హీరో మహేష్, రచయిత అడ్డిచర్ల సాగర్, డీవోపీ అండ్ ఎస్ఎస్ స్టూడియోస్ ప్రొప్రైటర్ దుర్గం విజయ్, 24 ఆర్ట్స్ కళాకారులు, కోటపల్లి పోలీస్ స్టేషన్ మూవీ ఆర్టిస్టులు, సాంకేతిక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం

మంచిర్యాల ఏసీసీ, ఏప్రిల్ 1 : మంచిర్యాల జిల్లా స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ స్టేట్ మేనేజింగ్ కమిటీ మెంబర్ వీ మధుసూదన్ రెడ్డి సోమవారం తన కుటుంబ సభ్యులతో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రక్తనిధి కేంద్రంలో స్వచ్ఛంద రక్తదానం చేయించారు. గతంలో కూడా పలు మార్లు రక్తదానం చేసినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో రక్తనిధి కేంద్ర సిబ్బంది, సూపర్‌వైజర్ కే మాధవి, మల్లీశ్వరి, సంధ్య, శైలజ, మౌనిక, వేణు తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ
CLASSIFIED

పాస్‌పోర్ట్ పోయినది

నేను గుగ్లావత్ గబ్బర్‌సింగ్ తండ్రి గుగ్లావత్ వాల్యా, లింగాపూర్ గ్రామము: మం: మామడ జిల్లా: నిర్మల్ తెలంగాణ నా యొక్క పాస్‌పోర్ట్ నెం.M1859098 గల పాస్‌పోర్ట్ తేది: 08-03-2024 రోజున లింగాపూర్ గ్రామము నుండి మామడ మండలంకు బైక్‌పై ప్రయాణించగా ఎక్కడో పడిపోయినది. దొరికినవారు. ఈ క్రింది నెంబర్‌కు తెలియజేయండి. సెల్ నెం: 90105 10664.

పాస్‌పోర్ట్ పోయినది

నేను బుక్య వినోద్ తండ్రి: మోతిలాల్ ఇ.నెం.4-47, గ్రా।। తాటిగూడ, మం।। పెంబి, జి: నిర్మల్, తెలంగాణ నా యొక్క పాస్‌పోర్ట్ నెం.K3639678 గల పాస్‌పోర్ట్ తేది:03-03-2024 రోజున మందపల్లి గ్రామం నుండి తాటిగూడ గ్రామానికి బైక్‌పై ప్రయాణించగా ఎక్కడో పడిపోయినది. దొరికినవారు ఈ క్రింది నెంబర్‌కు తెలియజేయండి. సెల్: 9347365255

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

'మత్స్య సంపద యోజన' సద్వినియోగం చేసుకోవాలి

తాండూర్, ఏప్రిల్ 1 : చేపల పెంపకం చేపట్టాలనుకునే యువత, రైతులు ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మల్టీ స్టేట్ కో-ఆపరేటివ్ నేషనల్ ఫిషరీస్ అధ్యక్షుడు జయదీప్ పాటిల్ అన్నారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజనలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పథకాలపై మండల కేంద్రంలోని మత్స్యసహకార సంఘం కార్యాలయంలో సోమవారం మత్స్యకారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మల్టీ స్టేట్ కో-ఆపరేటివ్ అధ్యక్షుడు పూలబోయిన భీమన్న, ఫిషరీస్ జిల్లా వైస్ చైర్మన్ కంపెల చిన్నయ్య, మల్టీస్టేట్ కో-ఆపరేటివ్ తాండూర్ కో-ఆర్డినేటర్ రెవెల్లి శ్రీనివాస్, మత్స్యకారులు పెద్దబోయిన మహేశ్, కంపెల శ్రీనివాస్, పెద్దబోయిన శంకర్, పెద్దబోయిన రవి, ఉప్పుట్ల చంద్రశేఖర్, ఉప్పర్ల సంతోష్, మేడి శంకర్, మేడి సునీత, మేడి మల్లేశ్వరి, పెద్దబోయిన శ్రావణి, పెద్దబోయిన సంధ్య పాల్గొన్నారు.

క్రీడాకారులకు బహుమతులు

భీమారం, ఏప్రిల్ 1 : మండల కేంద్రంలో కాకా వెంకటస్వామి స్మారక క్రికెట్ టోర్నీ నిర్వహించగా, విజేతలకు చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చేకూర్తి సత్యనారాయణ రెడ్డి, పోడెటి రవి, వేల్పుల శ్రీనివాస్, పోటు భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైనిక్ పాఠశాలకు ఎంపిక

కోటపల్లి, ఏప్రిల్ 1 : కోటపల్లి మండలం రాపనపల్లి గ్రామానికి చెందిన గుర్రం రాణి-సమ్మయ్య కొడుకు ఆకాశ్ భారత సైనిక్ స్కూల్‌కు ఎంపిక అయ్యాడు. ఎంట్రన్స్ టెస్ట్‌లో ప్రతిభ చూపిన ఆకాశ్, 6వ తరగతి ప్రవేశం పొందనున్నాడు.

నేడు ఇసుక వేలం

హాజీపూర్, ఏప్రిల్ 1 : అక్రమంగా రవాణా చేస్తూ ఇటీవల పట్టుబడిన ఇసుకను మంగళవవారం వేలం వేస్తున్నట్లు హాజీపూర్ తహసీల్దార్ సతీశ్‌కుమార్ తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు హాజీపూర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

అక్రమాలపై విచారణ జరిపించాలి

మంచిర్యాల అర్బన్, ఏప్రిల్ 1 : కేంద్రీయ విశ్వ విద్యాలయా(కేవీవీ)ల్లో విద్యార్థులకు సీట్ల కేటాయింపు విషయంలో అక్రమాలు జరిగాయని, సమగ్ర విచారణ జరిపించాలని జాతీయ విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని గవర్నర్ కార్యాలయంలో గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేరాల వంశీ మాట్లాడుతూ.. కేవీవీల్లో సీట్ల శాతం పెంచాలని, నూతనంగా మరిన్ని స్కూల్స్ ఏర్పాటు చేయాలని కోరారు. సీట్ల కేటాయింపుల్లో అక్రమాలు జరిగాయని, ఎలా కేటాయిస్తున్నారో విచారణ చేయాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

దండేపల్లి, ఏప్రిల్ 1 : దండేపల్లి మండలం మాకులపేట గ్రామానికి చెందిన కొత్తపెల్లి రాజేశం(62) సోమవారం ఉదయం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. దండేపల్లి ఎస్ఐ స్వరూప్‌రాజ్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజేశం ఉదయం 6 గంటల ప్రాంతంలో మాకులపేట నుంచి తాళ్లపేటకు పాలు తీసుకురావడానికి వెళ్లాడు. నాగసముద్రం గ్రామానికి చేరుకోగానే జన్నారం వైపు నుంచి ఎదురుగా వస్తున్న కారు బలంగా ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య సుమతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జిల్లా ఖజానా అధికారిగా రాజగోపాల్



విధులు స్వీకరిస్తున్న రాజగోపాల్, రమేశ్

మంచిర్యాల అర్బన్, ఏప్రిల్ 1 : కలెక్టరేట్‌లోని జిల్లా ఖజానా అధికారిగా ఎస్ రాజగోపాల్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లోని వైద్య ఆరోగ్య సేవల నియామక బోర్డులో అకౌంటెంట్ అధికారిగా విధులు నిర్వహించిన ఈయన, ఉద్యోగోన్నతిపై ఇక్కడికి వచ్చారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ట్రెజరరీ అధికారి జాడి రాజేశ్వర్ మంచిర్యాలకు ఇన్‌చార్జి ట్రెజరరీ అధికారిగా విధులు నిర్వహించిన విషయం తెలిసిందే. అలాగే పెద్దపల్లి జిల్లా ఖజానా శాఖలో ఏటీవోగా విధులు నిర్వహిస్తున్న కే రమేశ్ మంచిర్యాల ఖజానా కార్యాలయ ఇన్‌చార్జి ఏటీవోగా బాధ్యతలు స్వీకరించారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

మంచిర్యాల ఏసీసీ, ఏప్రిల్ 1 : పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ప్రతి ఒక్కరూ నియమ నిబంధనలు పాటించాలని మంచిర్యాల డీసీపీ అశోక్ కుమార్ అన్నారు. పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సోమవారం మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఎన్నికల ప్రచారానికి సంబంధించిన సమావేశాలు, ర్యాలీలు, ప్రచార కార్యక్రమాలు, మైక్ పర్మిషన్ల కోసం సువిధ యాప్‌లో 48 గంటల ముందుగానే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఏసీపీ ఆర్ ప్రకాశ్, పట్టణ సీఐ బన్సీలాల్, రూరల్ సీఐ అశోక్ కుమార్, లక్సెట్టిపేట సీఐ నరేందర్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

మంచిర్యాల ఏసీసీ : మాట్లాడుతున్న డీసీపీ అశోక్ కుమార్

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన..

కాసిపేట, ఏప్రిల్ 1 : కాసిపేట మండలం దేవాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్, మందమర్రి సీఐ శశిధర్ రెడ్డితో కలిసి పరిశీలించారు. పెద్ద అరడిపెల్లి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి, వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు ఉన్నారు.

స్ట్రాంగ్ రూం పరిశీలన..

చెన్నూర్ రూరల్, ఏప్రిల్ 1 : మండలంలోని కిష్టంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసే స్ట్రాంగ్ రూములను జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు పరిశీలించారు. భద్రతా సౌకర్యాలపై చర్చించారు. తీసుకోవాల్సిన అంశాలపై పోలీస్ సిబ్బందికి సూచించారు. ఆయన వెంట చెన్నూర్, కోటపల్లి సీఐలు రవీందర్, సుధాకర్ ఉన్నారు.

తాగునీటి కొరత లేకుండా చూడాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

చెన్నూర్ రూరల్, ఏప్రిల్ 1 : చెన్నూర్ మండలంలోని ప్రతీ గ్రామపంచాయతీలో తాగునీటి కొరత లేకుండా చూడాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. నారాయణపూర్ పంచాయతీ పరిధిలోని రాగిపేట గ్రామాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. తాగునీరు సరఫరా చేసే ట్యాంక్‌ను పరిశీలించి, లీకేజీ ఉన్నదని, వెంటనే మరమత్తులు చేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో మోహన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సరిత, ఎంపీవో అజ్మత్ అలీ తదితరులున్నారు..

'గుర్తింపు' కాలపరిమితి రెండేళ్లే ఉండాలి

సీసీసీ నస్పూర్, ఏప్రిల్ 1 : సింగరేణి గుర్తింపు సంఘం కాలపరిమితి రెండేళ్లే ఉండాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి, ప్రధాన కార్యదర్శి మంద నర్సింహారావు డిమాండ్ చేశారు. నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సింగరేణి ఎన్నికలకు ముందు 13 సంఘాల్లో 9 కార్మిక సంఘాలు రెండేళ్ల కాలపరిమితితో ఎన్నికలు నిర్వహించాలని పట్టుబట్టడంతో కేంద్ర కార్మిక శాఖ అధికారులు ఎన్నికలు నిర్వహించారన్నారు. గెలిచిన తర్వాత ఏఐటీయూసీ నేతలు 4 ఏండ్లు కాలపరిమితి ఉండాలని పట్టుబట్టడం సరైందికాదన్నారు. కేంద్ర డిప్యూటీ సీఎల్‌సీ రెండేళ్ల కాలపరిమితితో గుర్తింపు పత్రం సింగరేణి యాజమాన్యానికి పంపించినా ఏఐటీయూసీ తీసుకోవడం లేదని ఆరోపించారు. ఎన్నికలు జరిగి మూడు నెలలు గడుస్తున్నా, కార్మికుల సమస్యలు ఎక్కడికక్కడే పేరుకుపోయాయని తెలిపారు. ఈ సమావేశంలో యూనియన్ బ్రాంచ్ అధ్యక్షుడు గుళ్ల బాలాజీ, కార్యదర్శి అంబాల శ్రీనివాస్, నాయకులు వెంగల శ్రీనివాస్, కస్తూరి చంద్రశేఖర్, శ్రీనివాస్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

మున్సిపల్ ఏఈ, డీఈపై చర్యలు తీసుకోవాలి

బెల్లంపల్లి, ఏప్రిల్ 2 : బెల్లంపల్లి మున్సిపాలిటీలోని వాహనాల కొనుగోలులో అవినీతి, అక్రమాలకు పాల్పడిన ఏఈ సందీప్, డీఈ మసూద్ అలీపై చర్యలు తీసుకోవాలని 20 మంది మున్సిపల్ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీడీఎంకు సోమవారం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. జేసీబీలు, 22 చెత్త సేకరణ ట్రాలీలు, రోడ్డు క్లీనర్, ఆల్ట్రేషన్ వాహనాను నాసిరకం కంపెనీల నుంచి తీసుకువచ్చారని, ఆ సంస్థల ప్రతినిధులతో లోపాయికారి ఒప్పందం చేసుకొని కమీషన్లు తీసుకున్నారని ఆరోపించారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఈ తన రాజకీయ పలుకుబడిని ఉపయోగించి బదిలీ కాకుండా ఇక్కడే ఉంటున్నాడని ఆరోపించారు. కరీంనగర్ మున్సిపాలిటీలో రెగ్యులర్‌గా చేస్తున్న డీఈ.. బెల్లంపల్లిలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నారని తెలిపారు. ఇక్కడికి కౌన్సిల్ సమావేశాలకు తప్ప ఏ కార్యక్రమంలోనూ కనిపించడం లేదని విమర్శించారు. వీరిద్దరి నిర్లక్ష్యం కారణంగా రూ.7 కోట్లతో నిర్మిస్తున్న సమీకృత కూరగాయల భవన నిర్మాణం నాలుగేళ్లుగా కొనసాగుతున్నదని ఆరోపించారు. సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముల్కల నుంచి గోదావరి నీరు బెల్లంపల్లికి త్వరగా వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సీడీఎంఏకు వినతి పత్రం ఇస్తున్న కౌన్సిలర్లు

పనుల పరిశీలన

లక్సెట్టిపేట, ఏప్రిల్ 1 : పట్టణంలో రూ.5.80 కోట్లతో నూతన ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల భవన నిర్మాణాలను మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు పరిశీలించారు. పనుల్లో పూర్తి నాణ్యత ఉండాలని, అన్ని హంగులతో నిర్మించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. భవన నిర్మాణ మ్యాప్‌ను పరిశీలించి, మార్పులు చేర్పులు ఉంటే తక్షణమే చెప్పాలని డీఐవో శైలజకు చెప్పారు. కౌన్సిలర్లు చెల్ల నాగభూషణం, రాందేని వెంకటేశ్, కో-ఆప్షన్ సభ్యుడు శాహెద్ అలీ, పార్టీ పట్టణాధ్యక్షుడు ఆరీఫ్, మండలాధ్యక్షుడు పింగిళి రమేశ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గడికొప్పుల కిరణ్‌కుమార్, నాయకులు గడ్డం త్రిమూర్తి, తోట రమేశ్, పడాల గౌతం, చంద్రమౌళి, సురేశ్, నలిమెల సత్తయ్య, నవాబ్ తదితరులు పాల్గొన్నారు.


కాంట్రాక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

షెడ్యూల్డ్ క్యాస్ట్ కమిషన్ సభ్యుడికి సన్మానం

శ్రీరాంపూర్, ఏప్రిల్ 1 : ఎన్‌టీపీసీ గెస్ట్‌హౌజ్‌లో సోమవారం జాతీయ షెడ్యూల్డ్ క్యాస్ట్ కమిషన్ సభ్యుడు రామచందర్‌ను శ్రీరాంపూర్ ఏరి యా డీవైజీఎం రాజేశ్వర్‌రావు, ఏరియా లైజన్ ఆఫీసర్ ఎస్ఈ కిరణ్‌కుమార్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలపై చర్చించినట్లు తెలిపారు. సానుకూలంగా స్పందించిన కమిషన్ సభ్యుడు రామచందర్ త్వరలోనే సింగరేణిస్థాయిలో రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేసి, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలపై చర్చిస్తానని హామీ ఇచ్చారని పేర్కొన్నారు.


రామచందర్‌ను సన్మానిస్తున్న అధికారులు

సమస్య తలెత్తకుండా నీటి సరఫరా

చెన్నూర్, ఏప్రిల్ 1 : చెన్నూర్ పట్టణంలో తాగునీటి సరఫరాకు సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని మున్సిపాల్ కమిషనర్ గంగాధర్ తెలిపారు. పట్టణంలోని పలు వార్డుల్లో సోమవారం పర్యటించారు. పైపు లైన్ లీకేజీలను పరిశీలించి, మరమ్మతులు చేయించారు. పట్టణంలో నీటి సమస్య ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకరావాలని ప్రజలకు సూచించారు. ఆయన వెంట మున్సిపాల్ ఏఈ సాయి కిరణ్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

లీకేజీలను పరిశీలిస్తున్న కమిషనర్ గంగాధర్

బాధ్యతాయుతంగా పని చేయాలి


మాట్లాడుతున్న అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రాహుల్

బెల్లంపల్లి, ఏప్రిల్ 2 : లోక్‌సభ ఎన్నికలోల పోలింగ్ అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని అదనపు కలెక్టర్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రాహుల్ సూచించారు. పట్టణంలోని సెయింట్ మేరీస్ ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులతో సమావేశం న్విహించారు. ఎన్నికల విధులపై వారికి పలు సూచనలు చేశారు. బెల్లంపల్లి డివిజన్‌లోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విరమణ కార్మికులకు సన్మానం

శ్రీరాంపూర్, ఏప్రిల్ 1 : శ్రీరాంపూర్ ఏరియాలోని గనులు, ఓసీపీల్లో విరమణ పొందిన కార్మికులను సోమవారం అధికారులు, నాయకులు ఘనంగా సత్కరించారు. శ్రీరాంపూర్ ఓసీపీలో విరమణ పొందుతున్న ఫిట్టర్ భాస్కర్‌రావును జీఎం సంజీవరెడ్డి, పీవో శ్రీనివాస్, ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధానకార్యదర్శి వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా సన్మానించారు. అనంతరం టర్మినల్ బెనిఫిట్ చెక్కులు అందించారు. ఓసీపీ మేనేజర్ బ్రహ్మాజీ, ఈఈ చంద్రశేఖర్, సేఫ్టీ ఆఫీసర్ ఐ శ్రీనివాస్, పిట్ కార్యదర్శి మోతె లచ్చన్న, కుమ్రుద్దీన్, సీనియర్ పీవో శంకర్ పాల్గొన్నారు. అలాగే ఆర్కే-7 గనిలో సీనియర్ హెడ్ ఓవర్‌మన్ పెరుగుచదరంగం సదానందంను మేనేజర్ శ్రీధర్, టీబీజీకేఎస్ ఏరియా కార్యదర్శి తొంగల రమేశ్, ఆర్గనైజర్ రాజునాయక్ సన్మానించారు.

మండలాధ్యక్షుడిగా రవీందర్

లక్సెట్టిపేట, ఏప్రిల్ 1 : మాల మహానాడు లక్సెట్టిపేట మండలాధ్యక్షుడిగా పట్టణానికి చెందిన గరిసె రవీందర్‌ను నియమిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు గజ్జెల్లి లక్ష్మణ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. లక్ష్మీపూర్ గ్రామంలో నిర్వహించిన గ్రామ కమిటీ సమావేశంలో ఆయనను నియమిస్తూ గ్రామ కమిటీని కూడా వేశారు. గ్రామ అధ్యక్షుడిగా సురమళ్ల ఏసురత్నం, గౌరవ అధ్యక్షుడిగా సురమల్ల లింగయ్య, ఉపాధ్యక్షుడిగా ఆసాది ప్రకాశ్, ప్రధానకార్యదర్శిగా సురమళ్ల ప్రకాశ్, కార్యదర్శిగా అంజన్న, కోశాధికారిగా మనోహర్‌ను నియమించారు. ఈ కార్యక్రమంలో ఆసాది పురుషోత్తం, సూర్యప్రకాశ్, కల్లు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ రోగులకు ఉచిత సేవలు

సీసీసీ నస్పూర్, ఏప్రిల్ 1 : క్యాన్సర్ రోగులకు శ్రీ అక్షయ, న్యూ అభయ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఉచిత సేవలు అందిస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ మాలి రమేశ్, మేనేజింగ్ డైరెక్టర్ వినయప్రశాంత్ తెలిపారు. నస్పూర్‌లోని సుమంగళి హాలులో సోమవారం శ్రీ అక్షయ, న్యూ అభయ చారిటబుల్ ట్రస్ట్ సమావేశం నిర్వహించారు. ట్రస్ట్ సభ్యులు పాల్గొని, పలు తీర్మాణాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్, పెద్దపల్లి జిల్లాల్లో హెరిటేజ్ క్లస్టర్ సెంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి అగస్టీన్, కోశాధికారి జాగిరి సురేశ్, సభ్యులు ఉదయ్‌కుమార్, శాంతికుమార్, పల్లె రాణి, సతీశ్, స్వప్న, దివ్యశిష్మ, ఎలిజబెత్, సునీత, సువర్ణ పాల్గొన్నారు.

అదృశ్యమైన వ్యక్తి మృతి..

అజ్గర్ అలీ (ఫైల్)

తాండూర్, ఏప్రిల్ 1 : అదృశ్యమైన వ్యక్తి మృతి చెందిన ఘటన తాండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, సీఐ కుమారస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. తాండూరులోని సుభద్ర కాలనీకి చెందిన మహ్మద్ అజ్గర్ అలీ (33) ప్రైవేటు పాఠశాల బస్సు డ్రైవర్‌గా పని చేసేవాడు. శనివారం రాత్రి ఇంటి నుంచి బయటికి వెళ్లి, తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఆదివారం సమీప బంధువుల ఇండ్లలో వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదృశ్యమైనట్లు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. ఇదే సమయంలో ఓసీపీ-2 సమీపంలో గుర్తు తెలియని మృతదేహం లభించినట్లు గుర్తించారు. ఏసీపీ, సీఐ తాండూరు ఎస్ఐ జగదీష్‌గౌడ్ సంఘటనా స్థలాన్ని సందర్శించారు. అక్కడికి అజ్గర్ కుటుంబ సభ్యులను తీసుకెళ్లగా, ముందు గుర్తు పట్టలేదు. భార్య హర్షియాబేగం అజ్గర్ చేతికి కట్టిన తాడుతో గుర్తుపట్టారు. అజ్గర్ మృతిపై అనుమానాలు ఉన్నట్లు కుటుంబ సభ్యులు ఆరోపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బెల్లంపల్లి ప్రభుత్వ దవాఖానకు తరలించారు.